తగూ నెంబరు 'త్రీ'

శర్మ జానకమ్మతో మళ్ళీ పోట్లాడాడు. వద్దురా నాయనా ఆ పిల్లను ఏమీ అనకు. సర్దుకుపో ఎల్లాగో ఒరగ బెట్టుకొని సంసారం చెయ్యాలి అని ఎన్నివిధాల చెప్పినా వాడి మనస్సుకు ఎక్క లేదు.

ఆ పిల్ల తనను గౌరవించటం లేదో అంటాడు.

ఓరి తెలివితక్కువ శర్మా.

పెళ్ళాము అన్న మనిషి. మొగుడు అన్న వాడిని ఎప్పుడూ గౌరవించదురా అని నెత్తిని నోరు పెట్టుకొని అర చినా వినిపించుకోడాయె !

లోకంలో పెళ్ళాలు, మొగుళ్ళను గౌరవిస్తున్నారూ అనుకోటం పెద్ద పొరపాటురా నాయినా, నా భార్య నన్ను ఏమాత్రం గౌరవిస్తున్నదీ చూస్తున్నావు కదా: అందరి సంగతీ అంతేరా అంటే వినడు, పైగా, నేను తెలివితక్కువగా భార్యకు లొంగిపోయినాననీ, తాను మహా తెలివిగా భార్యను అదుపుఆజ్ఞలలో ఉంచగలననీ గర్వపడ్డాడు, ఆ గర్వం కాస్తా అణిగింది !

మా కాంతమే నయం ! కొట్లాడినా, పోట్లాడినా గుమ్మందాటి ఎఱుగదు ! జానకి పుట్టింటికి వెళ్ళిపోయింది !

ఢంకామీద దెబ్బకొట్టినట్లు వెడుతున్నానని చెప్పి వెళ్ళిపోయింది.

నేనే అయితే ఆడమనిషిని గడపదాటనిచ్చేవాడినా! తెలివితక్కువ దద్దమ్మ కాబట్టి శర్మ ఆవిడ వెళుతూ ఉంటే కళ్ళు మిటకరించి చూస్తూ ఊరుకొన్నాడు.

పొద్దున పదిగంటలకల్లా పోట్లాట అయిపోయిందట! పదకొండింటికి భోజనంచేసి, పన్నెండింటికి ఆ పిల్ల 'ఇదిగో మీకే చెపటం, నేను వెళ్ళిపోతున్నాను బండి వచ్చింది, అని చెప్పి మరీ వెళ్ళిందట.

శర్మ ఈ మాటలు విని ఊరుకొన్నాడు. పన్నెండు గంటలకు బెజవాడ వైపుకు వెళ్ళే బండి ఏదీ లేదు. అయినా ఆ పిల్ల ఆ కొంపలో ఉండ టానికి ఇష్టంలేకే వెళ్ళి పోయి ఉండాలె.

మొగుడూ పెళ్ళామూ అన్న తరువాత ఏవో పోట్లా టలు ఉండకుండా ఉంటయ్యా, అంత మాత్రానికే ఇల్లూ వాకిలీ, మొగుణ్ణీకూడా వదిలేసి వెళ్ళిపోతున్నారా అందరూ!

శర్మకు నోరుంటే అంతపని జరిగేదికాదు. "నీవు వెళ్ళ దల్చుకొంటే నాకేమీ అభ్యంతరం లేదు. కాని రెండు గంటల బండికి వెళ్ళేవాళ్ళు ఎవ్వరూ పన్నెండు గంటలకే బయలుదేరరు. అందులో స్టేషను అంత దగ్గరలో ఉన్నపుడు ఓ పావుగంట ముందుగా బయలుదేరితే చాలు అని అందా మనుకొన్నాడట అనుకొంటూ ఉండగానే ఆమెగారు వెళ్ళి పోయిందట!

అట్లా అందామని అనుకోకపోతే 'ఏడిశావులే, ఇల్లు కదలటానికి వీల్లేదు ఈ ఎండలో, తలుపులన్నీ వేసి పడిఉండు అందామని అనుకోకూడదూ. ఇల్లాగ అనుకోంటానికైనా శర్మకు ధైర్యం లేకపోయింది. ఇంతకూ ఏదో అందామని అనుకోటమేగాని ఏదీ అనలేదు! ఆ పిల్ల మటుకు నేను వెడుతున్నానండోయ్! అని పబ్లీకుగా చెప్పి మరీ వెళ్ళిపోయింది.

తాను ఆ మాటలు విననట్లూ ఆ వెళ్ళటం చూడనట్లూ శర్మ నటించాడే కాని నిజానికి దొంగచూపులుచూచి ఆ పిల్లను ఓ కంటితో కనిపెట్టాడు. శర్మ అనుకోవటము ఏమిటీ అంటే తానేమీ తెలివితక్కువవాడు కాదూ అని! అయితే తలెత్తి ఎందుకు చూడలేదూ అన్న ప్రశ్న వస్తుంది. శర్మ ఆ విషయమై బాగా ఆలోచించే తల ఎత్తకూడదని నిశ్చయించుకొన్నాడు. తలెత్తి చూస్తే చాలా ఇబ్బందులు వస్తవి. ఆవిడ ఇల్లు వదలి వెళ్ళుతున్నట్లు గమనించిన తరువాత ఆవిడను పోనీయటము తన దర్జాకు లోపము. ''ఏయ్ ఎక్కడికీ? నోరుమూసుకొని పడిఉండు అని అనగలిగితేనే తల ఎత్తాలె అల్లాగ అనే శక్తి లేనపుడు గుట్టు చక్కంగా, తలదిండులో దూర్చి నిద్రపోతున్నట్లు నటించటమే తెలివైన పని అని అతని ఉద్దేశం. ఇతడు నిద్రపోతున్నాడా, మేలుకొని ఉన్నాడా అని తెలుసుకొంటానికైనా ఆ పిల్ల ప్రయత్నం చెయ్యలేదు, సాధారణంగా ఆ పిల్ల ఎక్కడికైనా పోయ్యే ముందు శర్మ దగ్గరకువచ్చి వెడుతున్నానని చెప్పి ఊరుకోదు మీద చెయ్యి వేస్తుంది. అటూ, ఇటూ పొర్లిస్తుంది.

అప్పటికీ తనకు మెలకువ రానట్లే శర్మ నటిస్తాడు. అబ్బ అదంతా నిద్రే! ఎందుకంటే అ దొంగనిద్ర! నిద్రపోయే వాళ్ళు నవ్వుతారు కామాలేం? అని ఇల్లాగ ఏదో తమాషాగా మాట్లాడి నవ్వించి మరీ వెళ్ళేది! ఇవ్వాళ అల్లాగ ఎందుకు చేస్తుందీ? పోట్లాట అయిన తరువాత కోపంతో వెడుతూ ఉండె! అందుకని అతనిని పలకరించకుండానే వెళ్ళి పోయింది.

శర్మమటుకు ఎంత అసాధ్యుడు! భార్య వెడుతూ ఉంటే ఏమైనా కానీయమని తలెత్తి చూడకుండా పడుకొన్నాడు. ఎంత గుండె నిబ్బరంగల మనిషి కాకపోతే అల్లాగ పడుకొని ఊరుకోగలడు. ఇంకొకరు అయితే గిలగిల్లాడక పోయినారూ!

జానకి ఖద్దరు సిల్కు చీర కట్టుకొని వాయిల్ రెవిక తొడుక్కొని, స్లిప్పర్లు తొడుక్కొని తక తకలాడిస్తూ వెళ్ళిపోయింది. అంతవరకు శర్మ కనిపెట్టాడు. ట్రంకు పెట్టా, మరచెంబు తీసికొని వెళ్ళినట్టు నాలుగు చీరలు ఏమైనా మూట గట్టుకొని పోయిందేమో, ఆ విషయం శర్మ చూడలేదు.

౨

శర్మ అత్తగారు బెజవాడలో ఉన్నది. జానకి అక్కడికే వెడుతుంది, ఆ ధైర్యంతోనే శర్మ అంతగా గాభరా పడలేదు. శర్మ ఆలోచిస్తూ పడుకొన్నాడు.

జానకి బెజవాడ వెడుతుంది. తన సంగతి తల్లితో చెబుతుంది. ఇదీ మొదట జరిగే పని, అల్లాగ జానకి తన్ను గురించి ఆమె గారితో ఉన్నవి కొన్నీ లేనివి కొన్నీ కల్పించి చెపితే తనకు వచ్చిన నష్టం ఏమిటా అని ఆలోచించాను.

శర్మకు వచ్చిన నష్టం ఏమీ లేదు—ఆమె మటుకు కూతురితో—"మహా మంచిపని చేశావే తల్లీ !

ఇక ఆ కొంపకు నీవు పోవద్దు" అంటుందా ?

ఎప్పటికీ అనదు.

రెండురోజులు అయిపోయిన తరువాత ఆ పిల్లకు చెప్ప వలసిన మాటలు చెప్పి, తీసుకొచ్చేదిగ బెడుతుంది. ఇంతలోకే వచ్చిన ప్రమాదం ఏమీ లేదు.

ఇక రెండో విషయం. జానకి అల్లాగ వెళ్ళిపోతూ ఉన్నప్పుడు తాను మెదలకుండా ఊరుకొన్నాడు అది మంచి పనేనా ?—

ఈ విషయమై శర్మ చాలా తీవ్రంగా ఆలోచించాను. ఊరుకోక ఏమి చెయ్యాల్సింది ? ? ?

తప్పు అల్లాగ వెళ్ళిపోకూడదు. భర్త అంటే దైవము భర్త పాదసేవ చేయుటమే స్త్రీ యొక్క ధర్మము. పతిని విడిచి పడతి ఉండరాదు, అని చెప్పి సీత, అనసూయ, అరుంధతి మొదలైన పతివ్రతల కథలు చెప్పాలిసింది, శర్మకు సంస్కృత శ్లోకాలు కూడా వచ్చును, అల్లాంటి సమయంలో

ఎటువంటి పాఠం చెప్పవచ్చు ! మంచి అవకాశాన్ని పోగొట్టుకొన్నాడు. ఈ విషయమై శర్మచాలాసేపు ఆలోచించి పొరపాటే జరిగి పోయింది అనుకొన్నాడు.

కాని అల్లాగ నీతిబోధ చెయ్యాలని శర్మకు జ్ఞాపకం వచ్చినా చేసే మనిషి కాడు, అదోరకం మనిషి, భార్యతో అట్టే మాట్లాడకూడదు అని అనుకొనేరకం, అదీకాక శర్మకు ఆడ భిడియం కూడా ఉందికొంత, అందుకనే అతడు భార్య వెళ్ళిపోతూఉంటే ఏమీ అనలేక పోయింది !

సరే, జరిగిందేమో జరిగింది, ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

ఇప్పుడు చేసేది ఏమీలేదు; హాయిగానిద్రపోదామూ అనుకొన్నాడు శర్మ నిద్రపోవచ్చును కూడాను మాట్లాడించే వాళ్ళుకూడా లేగాయె ఇంట్లో ! నిద్రపోయి లేచిన తరువాత తనకు కావలసిన ఫలహారం కూడా ఆ అమ్మాయి అక్కడే బల్లమీద పెట్టి మరీ వెళ్ళింది, బల్లమీద గుండు చెంబులో మంచినీళ్ళుకూడా ఉన్నవి ఇంకా తనకు కావలసిందేముంది? హాయిగా నిద్రపోయి సాయంత్రానికి హోటలులో చేరితే సారె !

సరిగ్గా ఇల్లాగే అను కొనుకొన్నాడు శర్మ-కోపంవస్తే మటుకు ఆ అమ్మాయి అల్లాగ చటుక్కున వెళ్ళిపోవటం తనను వదిలేసి ఏమంత మంచిపని కాదనే నిశ్చయానికివచ్చి, సరే కానీ చూద్దాం, అని తల పంకించాడు శర్మ.

ఆమెకోసం తాను రైలు స్టేషనుకు వెళ్ళాలా అని ఇంకో ప్రశ్న వచ్చింది. మళ్ళీ ఆలోచించాడు. ఈ తభా చాలా తొందరగానే ఒక గట్టి నిశ్చయానికి రాగలిగినాడు. ఏమిటీ అంటే అతను ఆమె కోసం వెళ్ళనూ వెళ్ళడు. బ్రతిమి లాడనూ బ్రతిమిలాడడు. ఇల్లాంటి పిచ్చిపనులు ఏమీ చెయ్యడు.

ఆమెవస్తే, వస్తుంది. రాదూ!

రాకపోనీ, ఎన్నాళ్ళు రాకుండా ఉంటుందో, ఆ సంగతీ కనుక్కొంటాడు. శర్మ ఇల్లాగ నిశ్చయించుకోటం చూస్తే తెలివి తక్కువ వాడు కాడూ అని తోస్తుంది. ఏం? బియ్యే. ప్యాసు ఆయె! తెలుగు పండితుడు—పద్యాలు కూడా వ్రాస్తాడు. తెలివితక్కువ వాడు అయ్యే ఖర్మం అతనికేం పట్టింది నిజానికి!

కాని ఒక్కటి! మనస్సు నిబ్బరం లేదు శర్మకు. చిన్నతనం కూడాను. ఇప్పుడు చూడండి, శర్మ అల్లా అనుకొని హాయిగా నిద్రపోవచ్చునా—నిద్రపోలేదు మరి!

ఏమిటీ అతని బాధ?—అవిడ మంచి ఎఱ్ఱని ఎండలో వెళ్ళింది, వడగాల్పు ఏమైనా తగిలి పడిపోయిందేమో నని భయం ఆ పిల్ల ఏమీ తెలివి తక్కువదిగాదు—స్టేషనులో వెయిటింగు రూములో కూర్చునే ధైర్య సాహసాలుగల మనిషి.

ఇదొక్కటే కాదు శర్మకు ఇంకా అనేక భయాలు పట్టుకొన్నవి. ఆ అమ్మాయి ఒక బండి ఎక్క బోయి, ఇంకో బండి ఎక్కుతుందేమో నని, అసలు ఆ జనంలో టిక్కెట్టు పుచ్చుకో లేదేమో నని ఆలోచనలుఅతనికి ! పోట్లాడి వెళ్ళిన మనిషి మీాద ఇతడికి కోపం లేక బోవటం ఏమిాా అని పిస్తుంది.

నిజం సంగతి ఏమిటీ అంటే అతనికి భార్యమీాదకోపం లేక పోలేదు. ఉన్నది ఆమె వెళితే వెళ్ళింది. అందుకనికాదు అతను తహతహ పడుతున్నది. ఈమెతల్లిగారింటికి సుఖంగా ప్రయాణంచేస్తే బాగుండును అని అతను ఆదుర్దా పడుతు న్నాడు కాని తనను వదిలి వెళ్ళిపోయి నందుకు కానేకాదు. అందుకనే అతడు స్టేషనుకు పోయి టిక్కెట్టుకొని ఆ అమ్మా యిని ఆడవాళ్ళ పెట్టెలో కూర్చోబెట్టి వద్దామా అని అను కొన్నాడు ఒక క్షణంలో.

కాని అల్లాగ చేస్తే బెట్టుపోతుంది. అన్యాయంగా పోట్లాడటమే కాకుండా ఇల్లు వదలి వెళ్ళిపోయిన మనిషి విష యమ్మై జాలి తల్చకూడదు. ఇబ్బంది పడనీ, తెలిసి వస్తుంది. అని మళ్ళీ అనుకొన్నాడు.

అనుకొన్నవాడు ఇక ఆ అమ్మాయి సంగతి ఆలోచిం చటం మానేస్తే శర్మ గట్టివాడే అనొచ్చు. మానెయ్యలేడే. అనేక విషయాలు జ్ఞాపకం తెచ్చుకొన్నాడు ఆమెమీాద కోపం పుట్టటానికి.

రాత్రిళ్ళు చదువుకొంటూఉంటే ఆపిల్లవచ్చి పుస్తకం మూసెయ్యడమూ, మహా చదివారు లెద్దురూ ఎందుకొచ్చిన చదువు అని అనటమూ వెక్కిరించటమూ అన్నీ జ్ఞాపకం వచ్చినవి.

తన కవిత్వాన్ని ఆమె ఎప్పుడూ మెచ్చుకోలేదు. పైగా మీ కవిత్వం నాకేమీ అర్థంకాదు. ఎవ్వరికీ అర్థం కాని పద్యాలు ఎందుకూ మీరు 'వ్రాయటం?' అంటుంది. ఛీ ఛీ—జానకి తన కెందుకూ కలిసిరాలేదు. పూర్వం కవులకు ఇల్లాంటి భార్యలే ఉండేవాళ్ళా? ఉన్నట్లయితే వాళ్ళు అల్లాంటి గ్రంథాలు వ్రాయగలిగే వాళ్ళా? తాను చిత్తుగా వ్రాసినదాన్ని ఫెయిర్‌గా వ్రాయటం కూడా చేతగాని మనిషి. ఆవిడతో కాపరం చెయ్యటమే తన జీవితంలో ఒక గొప్ప త్యాగం ఆ సంగతి ఆ పిల్లకొంచెం అయినా గ్రహించలేదు.

తాను సౌందర్య స్వరూపం తెలిసిన మనిషి ప్రసిద్ధ చిత్రకారుల చిత్రాలు, అజంతా చిత్రాలు, మొదలైనవి స్టడీచేసేవాడు. కాబట్టి తన అభిరుచియందు గౌరవం ఉంచి ఆమె తను ఎట్లాచెయ్యమంటే అట్లాగే చెయ్యాలె. ఏ చీర కట్టుకోమంటే ఆ చీర కట్టుకోవాలె. ఏ రవిక తొడుక్కో మంటే ఆ రవిక తొడుక్కోవాలె. అట్లా ఉండవలసిన స్థితిలో...ఆ పిల్ల ప్రతివిషయంలోనూ, తనకు వ్యతిరేకమే కద! ఈ విషయాలన్నీ జ్ఞాపకం వచ్చేసరికి శర్మకు జానకిపైన బాగా కోపమూ వచ్చింది. అసహ్యమూ

కలిగింది. ఏమన్నా కానీ స్టేషనుకు వెళ్ళకూడదు అను కొన్నాడు.

కాని ఒక్క విషయం అతనిని బాధిస్తున్నది. తన భార్య స్టేషనులో ప్లాటుఫారం మీద ఒంటరిగా నుంచు న్నప్పుడు కుఱ్ఱవాళ్ళు ఆమెను ఎగా దిగా చూస్తారే అని అతనికి కష్టంగాఉంది. తాను ప్రక్కనమంచుని ఉంటే, ఆవిడను కన్నెత్తిచూడటానికి ఎవ్వరికీ గుండెలుండవు. ఒంట రిగా ఉన్న ఆడపిల్లను అంతా చూస్తారు; కొందరు ధైర్యం చేసి మాట్లాడిస్తారు కూడా; ఛా, ఎంత అప్రతిష్ట!

ఈ ఒక్క విషయమే అతనిని ఎక్కువగా బాధపెట్టి స్టేషనుకు వెళ్ళుదామా అని అనుకొనేటట్లు చేసింది. కాని తీరా వెడితే ఏమన్నా బాగుంటుందా? ఏమనుకుంటుంది? ఆ పిల్ల తనను బ్రతిమిలాడి ఇంటికి తీసుకొని వెళ్ళటానికి వచ్చాడూ అనుకొంటుంది. దాని తరువాత అందరితోనూ చెబుతుంది. నేను కోపం వచ్చి వెళ్ళిపోయాను. ఆయన స్టేషనుకు పరుగెత్తుకొనివచ్చి, బ్రతిమిలాడకపోతే వచ్చే దాన్ని కాను. అసలు ఆయన నన్ను వదిలి, క్షణం ఉండ లేరమ్మా అని అందరితోనూ చెప్పుకొంటుంది.

ఇదంతా ఆలోచించే శర్మ స్టేషనుకు పోవటం మాను కొన్నాడు. కాని ఆ అమ్మాయి ప్రయాణంలో నానా అవస్థ పడుతుంది; పడనీ దానికి అంతే కావాలె ఇల్లాంటి బుద్ధి తక్కువపని చేసినందుకు భర్తతో పోట్లాడి ఒంటరిగా ప్రయా

ణం చేయడం అంటే ఏమిటో తెలుస్తుంది, జానకికే కాదు, లోకానికంతా తెలియవలసిన విషయం ఇది! ఈ మహత్తరమైన నీతిని లోకం తెలుసుకొనేందుకైనా తాను ఆమెకు సాయం పోకూడదని శర్మ నిశ్చయించుకొని కళ్ళు గట్టిగా మూసుకొన్నాడు.

శర్మ నిద్రపోలేదు. అతనికి ఏదో ఆలోచన వచ్చింది చటుక్కున లేచి తలదువ్వుకొని పైన ఉత్తరీయం వేసుకొని పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ బజారుకు వెళ్ళాడు ఏం చేద్దామనో ఏమో?

శర్మ చాలా చిరాకుగా ఉన్నాడు, ఎప్పుడూ నవ్వుతూ ఉండే ముఖం- ఆ రోజున ముడుచుకు పోయింది- అతనికి మనస్సులో చాలా కష్టంగా ఉంది. కళ్ళు ఏమీ కాంతివంతంగా లేవు, గంభీరంగా ముఖం పెట్టి చాలా తొందరగా నడిచి పోయినాడు.

వీధిలో అటూ ఇటూ చూడకుండా ఏదో చాలా అత్యవసరమైన పనిమీద వెళ్ళేవాడు లాగ నడిచాడు, అతని ముఖంలో ఏదో పట్టుదల కనపడుతున్నది. ఏదో అఘాయిత్యం చేసేవాడులాగ ఉన్నాడు- ఎవరినైన కొడతాడో, చంపుతాడో! శర్మం ఏంచెయ్య దల్చుకొన్నాడో ఖర్మం!

అల్లాగ నడిచి వీధికొసను ఉన్న కాఫీహోటలులోకి విసురుగా వెళ్ళాడు- ఆ హోటలు యజమానిని కొట్టటానికి వెడుతున్నట్లు.

శర్మ హోటలులో ప్రవేశించి ఒక కొసను ఉన్న కుర్చీలో కూర్చున్నాడు-

క్రింద ఒక ఇత్తడిగ్లాసు పడేసిఉంటే దాన్ని ఓతన్ను తన్నాడు- ఇంకా ఎవరినైనా ఒకరిద్దరు మనుష్యులనే తన్నాలన్నంత కోపంగా ఉన్నది అతనికి. కానిపరిస్థితులు అనుకూలంగా లేవు-

అక్కడున్న కుర్రవాడు తెచ్చి యిచ్చిన కాఫీ చాలా వేడిగా ఉంది అయినా ఏమాత్రం లెక్కచేయకుండాఆకప్పు కాఫీని గుటుక్కు గుటుక్కున మింగేశాడు.

శర్మ వెంటనే బయటికివచ్చి ఓజట్కా బండిని పిలిచి స్టేషనుకు మాట్లాడి, ఎక్కికూర్చుని, పది గజాలు పోయిన తరువాత ఆపించి, దిగి, జట్కా పంపేశాడు! పాపం శర్మకు ఏమీ తోచటంలేదు- ఏదో బాధ పడుతున్నాడు.

ఆ తరువాత శర్మ బస్ స్టాండుకుపోయి బెజవాడ వైపుకు పోతున్న బస్‌లో ఎక్కి కూర్చున్నాడు- చాలా కోపంగా ఉన్నాడు.

ఏం జరిగిందీ అంటే, శర్మకు అసలు మొదట అంత కోపం రాలేదు జానకి వెళ్ళిపోయినందుకు. కాని కళ్ళు గట్టిగా మూసుకొని పడుకొన్నాడే, దాని తరువాతే అతనికి ఒళ్లు మండి పోయింది. ఎందుకంటే శర్మ కళ్ళుమూసుకొని నిద్ర పోలేదు. తీవ్రంగా ఆలోచించాడు జానకిచేసిన పనినిగురించి- ఆ అమ్మాయి కాస్త తగూ ఓ చిన్నవిషయంలో వచ్చినంత

మాత్రాన ఇల్లువాకిలీ వదలి ఇల్లాగ వెళ్ళిపోవటంచాలాతప్పు పని అనీ, ఆమెను తప్పక శిక్షించాలనీ అతనికితోచింది- అందుకనే ఇప్పుడు శర్మ బెజవాడ పోతున్నాడు-

శర్మ ఏమిచేయ దల్చుకొన్నాడో మనము ఊహించ గలము:-బెజవాడవెళ్ళి జానకిని జుట్టుపట్టుకొని లాగి బండిలో పడేసి బందరు తీసుకొని రావాలనే నిశ్చయంతో ఉన్నాడని మాత్రం మనము ఊహించవచ్చు- మనిషికికోపంవస్తే ఎంత పని అయినా చేస్తాడు- ఎంత సాత్వికుడు అయినా కోపగ్రస్తుడు అయి పిచ్చివాడు అయిపోతాడు గదా!

శర్మ బెజవాడలో దిగి యక్కాయకిని అత్తగారింటికి వెళ్ళాడు. శర్మ అత్తగారు వీధి గుమ్మంలోనే కూర్చుఉంది- ఆమె శర్మనుచూచి, దిగ్గునలేచి, కాళ్ళు కడుక్కోను నీళ్ళు యిచ్చి, ఏం, నాయనా, జానకి కులాసాగా ఉందా ? అని అడిగింది.

ఈ ప్రశ్న వినేసరికి శర్మకు పైప్రాణాలు పైనేపోయి నవి- జానకి తల్లి దగ్గరకు వచ్చిఉన్నట్లయితే ఈ ప్రశ్న ఎందుకు వస్తుంది.

ఏమిటి ఖర్మం ? జానకి ఏమైనట్లు ? ఇలాగ అతడు ఆలోచిస్తూ నుంచునే సరికి ముసలమ్మకి ఆదుర్దా ఎక్కువ అయింది. ఏం నాయనా మాట్లాడవేం? జానకి కులాసాగా ఉందా? అని మళ్ళీ అడిగింది.

శర్మ తెప్పరిల్లి, 'ఆఁ కులాసాగానే ఉన్నది' అని చెప్పాడు కాని ముసలమ్మకు ఏమాత్రం తృప్తి కలగలేదు. లక్ష ప్రశ్నలడిగింది-అన్నిటికీ ఏవో పరధ్యానంగా జవాబులు చెప్పాడు శర్మ.

శర్మ తల గిఱ్ఱున తిరిగిపోతున్నది-జానకి ఏమైపోయి నట్లు? అప్పటికి ఆరున్నర అయింది-బందరులో రెండుగంట లకు బయలుదేరిన బండి గంటక్రితమే వచ్చి ఉండాలె మరి ఏమైనట్లు? శర్మకు ఏమీ తోచలేదు—

మనస్సు పరిపరి విధాల పోయింది-పొరపాటున ఇంకో బండి ఎక్కిందా? ఏ బండి ఎక్కుతుంది? బందరులో బయలుదేరేది ఒక బండేనాయె!

గుడివాడలో దిగి పొరపాటున భీమవరం బండి ఎక్కిందా? గుడివాడలో కూర్చున్న బండిలోనుంచి దిగటం ఎందుకు ఇంకో బండిలో ఎక్కడం ఎందుకూ? అఁహఁ అది కాదు—

అయితే ఏమైనట్లూ అని! ఏదో అఘాయిత్యంచేసి ఉంటుంది ఆ కోపంమీద!

శర్మ ఆలోచిస్తూ నుంచోటం చూచి ముసలమ్మ అప్పుడే గ్రహించింది ఏదో జరిగిందని. ఏం, నాయనా ఏమిటి సంగతి చెప్పు అని అదుర్దాగా అడిగింది.

శర్మకు గుండెలు కొట్టుకో సాగినవి—

ఏమని చెప్పాలె? "ఈ పూరే వస్తానని బందరులో రెండు గంటలబండి ఎక్కిందంటి—ఆవిడ రైలు ఎక్కింది.

నేనేమో బజారులో పనిచూచుకొని కారు ఎక్కివచ్చాను—మరి ఎందుకు రాలేదో!'' అన్నాడు శర్మ—

ముసలమ్మ ఈ మాటలు విని ''అయ్యో, జానకీ, ఎక్కడికెళ్ళావే, నా తల్లీ, ఏమైపోయినావే'' అంటూ గోలుగోలున ఏడవటం సాగించింది—

శర్మకు కూడా ఏడుపు వచ్చింది—ఏమైపోయింది జానకి? ప్రయాణంలో ఏదో ప్రమాదం సంభవించి ఉండా లనే ఇద్దరూ నిశ్చయించారు

శర్మకు కాళ్లు ఆడలేదు—వెంటనే బయలుదేరాడు అత్తగారు కూడా శర్మ వెంటనే వచ్చింది—ఇద్దరూ ఎనిమిది గంటల బండిలో బాదరు బయలుదేరారు—ప్రతిస్టేషనులో అడిగారు. ఎవరైనా ఆడ మనిషి రైలులోనుంచి పడిపోయిందా అని? అటువంటిది ఎక్కడా జరగలేదు—

అయితే ఎండదెబ్బకు జట్కాలోనే పడిపోయి ఉంటుంది—వాడు తీసికెళ్ళి ఆసుపత్రిలో చేర్చి ఉంటాడు—ఎంత అవస్థ వచ్చింది!

''అది బయలుదేరి పోతున్నపుడు ఈ ఎండఏమిటి? పోవటం ఏమిటి? అని చీవాట్లు వేయాలిసిందిపోయి మెదల కుండా ఎందుకు ఊరుకొన్నావు నాయనా?'' అని ముసలమ్మ శర్మను పొడిచిపొడిచి అడిగింది—శర్మ తాను పెళ్ళాన్ని కోప్పడకపోవటం తప్పేనని ఒప్పుకొన్నాడు—

అత్తగారూ అల్లుడూ బాదరులో రైలు దిగి బండి కట్టించుకొని ఆసుపత్రికే వెళ్ళారు జానకి పేరుగల ఆడపిల్ల ఆసుపత్రిలో లేదు—అసలు ఎండ దెబ్బ తగిలి ఆ రోజున ఆసుపత్రికి వచ్చిన వాళ్ళుకూడా ఎవ్వరూ లేరు.

సరేనని బండి ఇంటికి తోలించారు. ఇంటిముందు దిగి, ముసలమ్మ ఏడుస్తూ ముందరా, వెనక శర్మా లోపలికి వెళ్ళారు.

జానకి పడక గదిలో ఉన్నదల్లా పరుగెత్తుకొనివచ్చి తల్లిని కౌగలించుకొని ఏడ్చింది. తల్లి ఎందుకో ఏడుస్తున్న దని ఏడ్చిందే కాని, అసలు సంగతి ఏమిటో ఆ పిల్లకూ తెలియదు. ఆ పిల్ల ఏడుస్తూ ఏడుస్తూ ఇటు తిరిగి శర్మ ఏడ్వకపోవడంవల్ల కాస్త ధైర్యం కలిగి ఊరుకొన్నది.

దాని తరువాత జరిగిన కథ అంతా ఒకరి కొకరు చెప్పుకొన్నారు.

శర్మకుమటుకు ఒళ్ళు మండిపోయింది. జానకి వెడు తున్నానని చెప్పి రైలుకు వెళ్ళనేలేదని, మహిళామండలి సభకు వెళ్ళిందని తెలిసినపుడు!!

పైగా, నేను బెజవాడ వెడుతున్నానని మీకు చెప్పానా, మీరు అల్లాగ ఎందుకు అనుకోవాలె! అని దీర్ఘాలు తీస్తూ మొగుడిని వెక్కిరించింది జానకి?

ఆ పిల్ల బెజవాడ వెడుతున్నదని ఎందుకు తోచిందో జ్ఞాపకం రాలేదు శర్మకు. అయితే ఒకటి, వెడుతున్నానండీ

అంటే, కోపంవచ్చి వెళ్ళేమనిషి తల్లిదగ్గరకు వెడుతుందని అనుకోంటారుగాని ఎవరైనా, మహిళామండలికి వెళ్ళుతుం దని అనుకోరుగద !

ఆ తరువాత ముసలమ్మ ఎదటే మొగుడూ పెళ్ళాం మళ్ళీ పోట్లాడుకొన్నారు. "నీవు నన్ను మోసపుచ్చావు, నన్ను అల్లరిపెట్టాలనే ఇల్లాగ చేశావు" అంటాడు శర్మ.

పెద్ద పోట్లాట ఏమీ లేదు. మంచంపైన దుప్పటి, అంచులు క్రిందికి జారేలాగున వేస్తే బాగుంటుందీ అని ఆయన అన్నారు. అంచులు క్రిందికి జారేలాగున ఎవ్వరూ వేసుకోరు పరుపుక్రిందికి అంచులు మడిస్తే బాగుంటుందీ అని నేను అన్నాను. ఈ విషయమై తగూవచ్చింది. నేను ప్రొద్దున దుప్పటి అంచులు మడిచివేశాను. ఆయన పనివేళావచ్చి, నాలుగు వైపులా క్రిందికి వ్రేలాడేలాగు లాగారు. నేను మళ్ళీ మడిచేశాను. ఆయన మళ్ళీ లాగారు. ఆయన లేన పుడు నేను దుప్పటి అంచులు మడిచివేయుటం; నేను లేనపు డాయన లాగేయుటం ఇట్లా జరిగింది.

చివరకు నేను మడుద్దామనీ, ఆయన లాగేద్దామనీ ఒకేసారి వచ్చాము. కాస్సేపు ఈ విషయమై పోట్లాడుకొ న్నాము. నాకు కోపంవచ్చినమాట నిజమేననుకో. అయినా నేను బెజవాడ వెళ్ళిపోతానని చెప్పలేదే! అని జానకమ్మ తల్లితో చెప్పుకొన్నది.

శర్మా చెప్పాడు. ఊరుకొంటాడా ఏమిటి, అతను ప్రతి విషయంలోనూ ప్రతిఘటిస్తున్నది జానకి అని.

ఆ పూటకు ముసలమ్మ మడి కట్టుకొని ఇంత వండి అల్లుడికీ కూతురికీ పెట్టింది. తిన్నారు, వెళ్ళిపోయినారు

అన్నం తినేటప్పుడు నవ్వుకొంటూ సరదాగానే తిన్న వాళ్ళల్లా గదిలో చేరి మళ్ళా పోట్లాడు కొంటున్నారు! మళ్ళీ అదేవిషయం దుప్పటి అంచులు జారవిడిచి ఉంచాలా వద్దా అని!

"వీళ్ళ అమ్మ కడుపు బంగారంగానూ ఇట్లాగైతే ఎట్లా! అనుకొన్నది ముసలమ్మ పోట్లాట ఎంతసేపటికీ తెగేటట్లు లేదు.

ముసలమ్మ ఎట్లాగయినా అనుభవం గలది కాబట్టి వాళ్ళ ఇద్దరికీ ఒక విధంగా రాజీ కుదిర్చింది-జానకమ్మపడు కొనేవైపు దుప్పటి పరుపుక్రిందకు మడిచివేసేటట్లూ, శర్మ పడుకొనేవైపుమాత్రము దుప్పటి వ్రేలాడుతూ ఉండేటట్లూ ఒప్పందలలు అయినవి.

అంతటితో ఆ ఇద్దరూ పడి నిద్రపోయినారు ఆ రాత్రికి ఏ పోట్లాటా లేకుండా-